తలసేమియా నివారణకు సహకారం

ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి హామీ



ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డితో చంద్రకాంత్‌ అగర్వాల్‌, ఎమ్మెల్యే మక్కన్‌ సింగ్‌ రాజ్‌ ఠాకూర్‌, తేజ్‌ నారాయణ

రాజేంద్రనగర్‌: తలసేమియా నివారణకు ప్రభుత్వం తరఫున సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి హామీ ఇచ్చినట్లు తలసేమియా అండ్‌ సికిల్‌ సెల్‌ సొసైటీ (టీఎస్‌సీఎస్‌) అధ్యక్షుడు చంద్రకాంత్‌ అగర్వాల్‌ తెలిపారు. ఈ మేరకు మంగళవారం టీఎస్‌సీఎస్‌ సభ్యుల బృందం, రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌ సింగ్‌ రాజ్‌ ఠాకూర్‌, మహాలక్ష్మీ జువెల్లర్స్‌ యజమాని తేజ్‌ నారాయణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి రాష్ట్రంలో తలసేమియా నివారణ బిల్లు ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా చంద్రకాంత్‌ అగర్వాల్‌ మాట్లాడుతూ... ప్రస్తుతం మూడు జిల్లాల్లో విస్తరించిన తలసేమియా నివారణ ప్రాజెక్టు పురోగతిని సీఎంకు వివరించినట్లు తెలిపారు. రాష్ట్రంలో తలసేమియా నివారణకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జాయింట్‌ సెక్రెటరీ డాక్టర్‌ ఎస్‌.సంగీతను ఆదేశించినట్లు తెలిపారు.

అంతర్‌ కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర్‌ కళాశాలల క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయం డీన్‌ డాక్టర్‌ జెల్లా సత్యనారాయణ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల్లో గెలుపు ఓటములు సహజమని క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికయ్యే అవకాశం ఉందని ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. వర్సిటీ పరిధిలోని 11 కళాశాలల నుంచి దాదాపు 450 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నారమ్స్‌లో వ్యవసాయ శాస్త్రవేత్తల సమావేశం



సమావేశమైన వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్‌ అకాడమీ ఆఫ్‌ అగ్రికల్చర్‌ రీసర్చ్‌ మేనేజ్‌మెంట్‌ (నారమ్స్‌)లో మంగళవారం అగ్రికల్చర్‌ టెక్నాలజీ అప్లికేషన్‌ రీసెర్చ్‌ ఇనిస్టిట్యూట్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే రెండేళ్లకు గాను వ్యవసాయానికి సంబంధించిన పరిశోధనలపై ప్రతిపాదనలు, ప్రాజెక్ట్‌ ప్లానింగ్‌పై చర్చించారు. దేశంలోని 732 కేవీకేల డిజిటల్‌ ట్రాన్స్‌ఫర్మేషన్‌, రైతులకు పర్యావరణ వ్యవస్థ సేవలు, వాతావరణ స్థితిస్థాపకత కోసం వ్యూహాలు, నూనెగింజలపై క్లస్టర్‌ ఎఫ్‌ఎల్‌డీలు, ఎఫ్‌పీఓల ప్రభావ అంచనా తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో 24 మంది డైరెక్టర్లు, ప్రిన్సిపాల్‌ సైంటిస్టులు, ఇద్దరు వైస్‌ చాన్స్‌లర్లు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ఉంటాం



వట్టినాగులపల్లి చెరువులో చేపపిల్లలను వదిలిన సంఘం నాయకులు

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం మత్స్య సహకార సంఘాలకు అండగా నిలుస్తుందని నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లి సంఘం అధ్యక్షుడు అరుణ్‌కుమార్‌ అన్నారు. మంగళవారం ప్రభుత్వం తరఫున ఉచితంగా వచ్చిన 50వేల చేపపిల్లలను గ్రామంలోని గౌనిచెరువు, ఎర్రగుంట చెరువులలో సంఘం నాయకులతో కలిసి వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌ నగర శివారులోని చెరువుల్లో మురికినీరు కలవకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మురికి నీరు చెరువుల్లో చేరటంతో చేపలు చనిపోయిన మత్స్యకారులు తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బాలరాజ్‌ ముదిరాజ్‌, నాయకులు రాజు,మల్లేష్‌, నరసింహ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

ఎమ్మెల్యేకు కాంగ్రెస్‌ నేతల వినతి



ఎమ్మెల్యే ప్రకాశ్‌ గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ డివిజన్‌ ఎర్రబోడ పోచమ్మ దేవాలయం సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని గ్రామ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు భరత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం పలువురు నాయకులు రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే ప్రకాశ్‌ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కబ్జాకు పాల్పడుతున్న వారి వివరాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు భరత్‌ రెడ్డి తెలిపారు. భరత్‌ రెడ్డి మాట్లాడుతూ... సర్వే నంబర్‌ 7లో 400 గజాల ప్రభుత్వ స్థలం ఉందన్నారు. సదరు స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్‌ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు రాఘవేంద్ర, శ్రీకాంత్‌, మనోజ్‌, మహేందర్‌, నవీన్‌, మధు, ప్రశాంత్‌, కిషన్‌, హరీష్‌ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మిర్జాగూడలో సమస్యలపై సమీక్షిస్తున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌

మణికొండ: మిర్జాగూడ గ్రామ పరిధిలోని సమస్యలను తన దృష్టికి తెస్తే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్‌ అన్నారు. మంగళవారం ఆమె మున్సిపాలిటీలో విలీనమైన మిర్జాగూడ గ్రామంలో పర్యటించి సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్యం, నీటి సరఫరా, విద్యుత్‌, వీధి దీపాలు, మురుగునీటి సరఫరా తదితర సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తేవాలన్నారు. గ్రామంలో పనిచేస్తున్న సిబ్బంది ఎప్పటికపుడు సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ మేనేజర్‌ యోగేష్‌, ఏఈ శ్రీనివాస్‌, ఆర్‌ఐ అఖిల్‌, అకౌంటెంట్‌ కృష్ణయ్య, గ్రామ నాయకులు, మున్సిపల్‌ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి

చార్మినార్‌: రోజువారీ విద్యాభ్యాసంతోపాటు విద్యార్థులందరూ క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని ఈస్ట్‌ జోన్‌ డీసీపీ బాలస్వామి అన్నారు. నారాయణ పాఠశాలల స్పోర్ట్స్‌ మీట్‌ అంబర్‌పేట్‌ ఎంసీహెచ్‌ గ్రౌండ్‌లో మంగళవారం జరిగింది. కబడ్డీ, ఖోఖో, క్రికెట్‌ పోటీలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రెగ్యులర్‌ వ్యాయామం అవసరమన్నారు. కార్యక్రమంలో జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం బాల పరమేశ్వర్‌ రావు, నారాయణగూడా జోన్‌ ప్రిన్సిపాల్స్‌, కో–ఆర్డినేటర్స్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ స్పోర్ట్స్‌ మీట్‌లో విద్యార్థినీవిద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని జీఎం గోపాల్‌రెడ్డి తెలిపారు.

ఇంటింటి సర్వే ముమ్మరం

మణికొండలో 60 శాతం, నార్సింగిలో 75 శాతం పూర్తి



గండిపేటలో సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌, కౌన్సిలర్‌

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల, రాజకీయ సర్వే గండిపేట మండల పరిధిలోని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలలో ముమ్మరంగా కొనసాగుతోంది. సర్వే ప్రారంభమై 10 రోజులు గడిచింది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో 382 ఎన్యుమరేటర్‌ బ్లాక్‌లలో 57,300 నివాసాలు ఉండగా, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో 308 ఎన్యుమరేటర్‌ బ్లాక్‌లలో 24,248 గృహాలు ఉన్నాయి. ఇప్పటి వరకు మణికొండ మున్సిపాలిటీ పరిధిలో 60శాతం, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో 75 శాతం సర్వే పూర్తయినట్లు ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు ప్రదీప్‌కుమార్‌, టి. కృష్ణమోహన్‌రెడ్డిలు తెలిపారు. సర్వేలో చురుగ్గా పాల్గొంటున్న పేదలు తమ ఇంటిని సందర్శించిన సిబ్బందికి పూర్తి స్థాయిలో సహకరించి వివరాలను నమోదు చేయిస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి మున్సిపాలిటీలలో స్థిరపడిన వారు సర్వే తమకు అవసరం లేదని తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటున్న వారిలో కొందరు సర్వే తమకు అవసరం లేదని వివరాలు చెప్పడం లేదన్నారు. అలాంటి వారితో అదే విషయాన్ని నమోదు చేయించి సంతకం తీసుకుంటున్నట్లు కమిషనర్లు పేర్కొన్నారు. కొన్ని ఇళ్లల్లో ఎవరూ ఉండటం లేదని, అలాంటి ఇళ్లకు మరోసారి తమ సిబ్బందిని పంపి వివరాలు నమోదు చేయిస్తున్నామన్నారు. రోజు వారి సర్వే పత్రాలను ఒక చోట చేర్చి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

అక్కడక్కడా మిస్సింగ్‌లు..

జంట మున్సిపాలిటీల్లో ఒక్కో ఇళ్లు, అపార్ట్‌మెంట్‌లలో పదుల సంఖ్యలో కుటుంబాలు ఉన్నా, అందులో కొందరి వివరాలు మాత్రమే సేకరిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. ఆయా అపార్ట్‌మెంట్‌లలో పది మంది ఉండగా ఒకరు, ఇద్దరి వివరాలను తీసుకుని మిగతా వారివి వదిలేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అద్దెకు ఉంటున్న వారి వివరాలు అవసరం లేదని, ఇంటి యజమానుల వివరాలు మాత్రమే సేకరిస్తున్నామని సిబ్బంది చెబుతున్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. దీనిపై కమిషనర్లు స్పందిస్తూ అలాంటి ఇళ్లను గుర్తించి వివరాలు తెప్పిస్తామన్నారు.

సర్వేకు సహకరించాలి..

మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న ఇంటింటి సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలని నార్సింగి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్‌ కోరారు. మంగళవారం ఆమె గండిపేట మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇంటింటి సర్వేను కౌన్సిలర్‌ విజిత ప్రశాంత్‌యాదవ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సర్వేతో ప్రతి ఒక్కరి ఆర్థిక, సామాజిక, కులం, విద్య తదితర వివరాలను నమోదు చేసుకుని వాటి ఆధారంగా సంక్షేమ పథకాలను అందించే వీలు ఉంటుందన్నారు. నార్సింగిలో కౌన్సిలర్‌ ఉషారాణి తన వార్డులో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు.

కల్లు దుకాణాల తనిఖీ

శంషాబాద్‌: పట్టణంలోని పలు కల్లు దుకాణాలను శంషాబాద్‌ ఎక్సైజ్‌ సీఐ దేవేందర్‌రావు మంగళవారం తనిఖీ చేశారు. నిబంధనలకు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణంలోని వీకర్‌సెక్షన్‌ కాలనీలోని కల్లుదుకాణంలో కల్లు నమూనాలను తీసుకుని పరిశీలించారు. నిషేధిత మత్తుపదార్థాలను వినియోగించకూడదన్నారు. లైసెన్స్‌ నిబంధనలు అతిక్రమించకుడా విక్రయాలు చేపట్టాలని సూచించారు.

నేడు డయల్‌ యువర్‌ డీఎం కార్యక్రమం

రాయదుర్గం: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో బుధవారం 'డయల్‌ యువర్‌ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు హెచ్‌సీయూ డిపో మేనేజర్‌ ఎం మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రయాణికులు తాము ఎదుర్కొంటున్న , ఇతర సమస్యలను ఫోన్‌ ద్వారా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 9959226132కు ఫోన్‌ చేసితమ సమస్యను వివరించాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

25 నుంచి ఖాజాగూడలో నిత్య భిక్ష

రాయదుర్గం: అయ్యప్పస్వామి భక్తులకు ఈనెల 25 నుంచి గచ్చిబౌలి డివిజన్‌ ఖాజాగూడ లోని రత్నదీప్‌ సమీపంలోని హనుమాన్‌ దేవాలయంలో నిత్య భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు గురుస్వామి వెంకటేష్‌గౌడ్‌ తెలిపారు. గురుస్వామి కొమరగొని శంకర్‌గౌడ్‌ పర్యవేక్షణలో ప్రతి రోజూ మధ్యాహ్నం 1 గంట నుంచి 2.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 25న ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం 2025 జనవరి 3 వరకు కొనసాగుతుందన్నారు. విధులకు వెళ్లే వారికి సౌకర్యవంతంగా పదేళ్లుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని, అయ్యప్పస్వాములు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గుడిమల్కాపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు

గోల్కొండ: గుడిమల్కాపూర్‌ డివిజన్‌ భోజగుట్టలో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు దేవర వంశీ మాట్లాడుతూ తెలంగాణలో రోజురోజుకు బీజేపీ బలీయమైన శక్తిగా ఎదిగి కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా మారిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అనిల్‌, ప్రభు పూజారి, అశ్విన్‌మోదీ తదితరులు ఉన్నారు.

సంప్రదాయ కళల ఉత్సవం ప్రారంభం

జానపద కళలను రక్షించుకోవాలి: రమణాచారి

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్‌ థియేటర్స్‌ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న సంప్రదాయ కళల ఉత్సవం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారుడాక్టర్‌ కేవీ రమణాచారి మాట్లాడుతూ తల్లిదండ్రులనే మరిచిపోతున్న కాలంలో జాతి గుర్తింపునకు మాతృ కళలైన జానపద కళల గురించి పట్టించుకునేవారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు పద్మశ్రీ పురస్కార గ్రహీత కనకరాజు శిష్యుడు సుదర్శన్‌ బృందం ప్రదర్శించిన గుస్సాడి నృత్యం, పలు జానపద సంగీత కళా నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విశ్రాంత ఐపీఎస్‌ అధికారి ఆర్‌.ప్రభాకర్‌రావు, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్‌ పాల్గొన్నారు.

పార్కును అభివృద్ధి చేయండి



మారుతీనగర్‌ పార్కును పరిశీలిస్తున్న డీఈ శివసాయి

మణికొండ: ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న పార్కును మున్సిపాలిటీ పాలకవర్గం సకాలంలో అభివృద్ధి చేయకపోవటంతో వృథాగా మారిందని, ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని అభివృద్ధి చేయాలని మణికొండ మున్సిపాలిటీ , మారుతీనగర్‌ కాలనీవాసులు అన్నారు. మంగళవారం మున్సిపల్‌ డీఈ శివసాయి కాలనీ పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి ఇప్పటి వరకు నిర్మించిన ప్రహరీ పనులు, మిగిలి ఉన్న అభివృద్ధి పనుల వివరాలు తెలిపారు. లే అవుట్‌లో ఉన్న పార్కును కబ్జాకు యత్నిస్తే పోరాడి సాధించుకున్నామన్నారు. అలాంటి పార్కులను వెంటనే అభివృద్ధి చేయాల్సి ఉన్న ఇప్పటి వరకు సగం పనులు చేసి వదిలేశారన్నారు. కొన్ని కాలనీలలోని పార్కులను అభివృద్ధి చేస్తున్న అధికారులు తమ కాలనీలోని పార్కు అభివృద్ధిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇకనైనా వెంటనే పార్కు అభివృద్ధి పనులను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గంగాధర్‌ పాల్గొన్నారు.

నారమ్స్‌ డైరెక్టర్‌ జనరల్‌కు ప్రతిష్టాత్మక పురస్కారం



పురస్కారం అందుకుంటున్న నారమ్స్‌ అధికారులు

ఏజీవర్సిటీ: నేషనల్‌ అకాడమీ ఆఫ్‌ అగ్రికల్చర్‌ రీసెర్చ్‌ మేనేజ్‌మెంట్‌ (నారమ్స్‌) డైరెక్టర్‌ జనరల్‌ డాక్టర్‌ సీహెచ్‌ శ్రీనివాస్‌కు ప్రతిష్టాత్మక ప్లాటినం జూబ్లీ పురస్కారం లభించింది. న్యూ ఢిల్లీలో మంగళవారం జరిగిన గ్లోబల్‌ సాయిల్స్‌ కాన్ఫరెన్స్‌–2024 సందర్భంగా సాయిల్‌ సైన్స్‌లో విశేష కృషి చేసినందుకు గాను ఆయన ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌ సింగ్‌ చౌహాన్‌ నుంచి పురస్కారం అందుకున్నారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్‌ సైంటిస్ట్‌ డాక్టర్‌ దామోదర్‌రెడ్డి కూడా అవార్డు అందుకున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌

మణికొండ: అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారిని రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా ఆదుకుంటుందని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ అన్నారు. మంగళవారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌ గ్రామానికి చెందిన డి.విజయలక్ష్మి, జి. కొమురయ్య, ఆర్‌. అక్కమ్మ, వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన రేఖకు మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పలు పథకాలను అమలు చేస్తుందన్నారు. మహిళలకు ఉచిత గ్యాస్‌, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌, ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ తదితర పథకాల అమలుతో పేదల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. అర్హులందరూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నార్సింగి పీఏసీఎస్‌ చైర్మెన్‌ టి. కృష్ణ, కౌన్సిలర్‌ జి.అమరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్‌, నాయకులు కిషోర్‌ పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్‌ హెరిటేజ్‌ వీక్‌ ప్రారంభం

గోల్కొండ: ప్రపంచ ప్రసిద్ధ కట్టడాలకు హైదరాబాద్‌ నగరం పెట్టింది పేరని గోల్కొండ డివిజన్‌ ఏసీపీ సయ్యద్‌ ఫయాజ్‌ అన్నారు. సోమవారం గోల్కొండ కోటలో కేంద్ర పురావస్తు పర్యవేక్షక శాఖ ఆధ్వర్యంలో వరల్డ్‌ హెరిటేజ్‌ వీక్‌ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సయ్యద్‌ ఫయాజ్‌ అక్కడ ఏర్పాటు చేసిన చిత్రమాలికను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అద్భుతమైన కట్టడాలు ఎన్నో మన నగరంలో ఉన్నాయని, గోల్కొండ కోటతోపాటు చార్మినార్‌ దీనికి నిదర్శనమన్నారు. వారసత్వ కట్టడాలను, ప్రాచీన శిల్పాలను పరిరక్షించడంలో కేంద్ర పురావస్తు పరిరక్షణ శాఖ అధికారులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కేంద్ర పురావస్తు పరిరక్షణ శాఖ డిప్యూటీ ఆర్కియాలజిస్టు డాక్టర్‌ హెచ్‌ఆర్‌ దేశాయి, గోల్కొండ కోట ఇన్‌చార్జి నవీన్‌, సాయిక్రిష్ణ తదితరులు ఉన్నారు.



గోల్కొండ కోటలో వరల్డ్‌ హెరిటేజ్‌ ప్రారంభ కార్యక్రమంలో ఏసీపీ సయ్యద్‌ ఫయాజ్‌

నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు



రాజేంద్రనగర్‌: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని రాజేంద్రనగర్‌ విద్యుత్‌ అధికారులు తెలిపారు. ఉప్పర్‌పల్లి ఫీడర్‌ పరిధిలోని ఫోర్ట్‌వ్యూ కాలనీ, గోల్డెన్‌ హైట్స్‌ కాలనీ హిల్స్‌, సత్సంగ్‌ విహార్‌, జనచైతన్య–1,2,3,4, పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, సన్‌రైజ్‌ హోమ్స్‌ ఫీడర్‌ పరిధిలోని సన్‌రైజ్‌ విల్లాస్‌, సన్‌రైజ్‌ హోమ్స్‌ కాలనీ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి



ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించిన నాయకులు

అత్తాపూర్‌: దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని అత్తాపూర్‌ చౌరస్తాలో కాంగ్రెస్‌ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్‌ పార్టీ జిల్లా కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో చౌరస్తాలో ఇందిరమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు ఇందిరాగాంధీ బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలు, దేశాభివృద్ధికి చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌, భాస్కర్‌గౌడ్‌, రవీందర్‌గౌడ్‌, మధు, రవీందర్‌, రమేష్‌, మహేందర్‌, రత్నం, అరవింద్‌సింగ్‌, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



రూపాలి(ఫైల్‌)

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటికి వెళ్లిన బాలిక అదృశ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ పైడినాయుడు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..మహరాష్ట్ర, నాందేడ్‌ ప్రాంతానికి చెందిన పండిత్‌ పోదాడి, అంజలి దంపతులు కాటేదాన్‌ ప్రాంతానికి వలస వచ్చి కార్మికులుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె రూపాలి (16) గత నెల 28న పనికి వెళ్లి తిరిగి రాలేదు.దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్‌ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వృద్ధురాలి దుర్మరణం



చాంద్‌ బీ(ఫైల్‌)

మైలార్‌దేవ్‌పల్లి: రైలు ఢీ కొని ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి...శాస్త్రీపురం డివిజన్‌ షమాకాలనీకి చెందిన చాంద్‌బీ(70) మంగళవారం సాయంత్రం ఉడెంగడ్డ రైల్వేట్రాక్‌ దాటుతుండగా అదే సమయంలో వేగంగా వచ్చిన రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది.స్థానికుల సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్‌ నిర్లక్ష్యానికి ప్రయాణికుడి బలి

లంగర్‌హౌస్‌: ఆటో డ్రైవర్‌ నిర్లక్ష్యానికి ఓ ప్రయాణికుడు బలి అయ్యాడు. లంగర్‌హౌస్‌ ఇన్‌స్పెక్టర్‌ రఘుకుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం... టోలిచౌకి హకీంపేట్‌లో నివాసముండే మొహమ్మద్‌ చోటుమియ్యా(55) వృత్తిరీత్యా సెంట్రింగ్‌ పని చేస్తున్నాడు. ఈ నెల 12 తేదీన పనులు ముగించుకొని రాత్రి ఏడు గంటలకు ఇంటికి వెళ్లడానికి మెహిదీపట్నంలో ఆటో ఎక్కాడు. ఆటోలో అప్పటికే ప్రయాణికులు నిండటంతో డ్రైవర్‌ తన పక్కన కూర్చోబెట్టుకున్నాడు. డ్రైవర్‌ వేగంగా ఆటోను అటుఇటు తిప్పుతూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్‌ చేశాడు. దీంతో టోలిచౌకి ఫ్లై ఓవర్‌ బ్రిడ్జి ప్రారంభంలో చోటుమియ్యా ఆటోలో నుంచి జారి కింద పడ్డాడు. గాయాలపాలైన అతన్ని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. అయితే ప్రమాద సమయంలో వివరాలు సేకరించిన ఫిల్మ్‌నగర్‌ పోలీసులు మంగళవారం కేసును లంగర్‌హౌస్‌ పోలీసులకు అప్పగించారు. మృతదేహానికి ఉస్మానియా మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

3 కిలోల గంజాయి స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: ఎక్సైజ్‌ పోలీసులు మంగళవారం నగరంలోని రెండు చోట్ల దాడులు నిర్వహించి 3 కిలోలకుపైగా గంజాయిని పట్టుకున్నారు. దూల్‌పేట్‌ జుమ్మెరాత్‌ బజార్‌లోని ముఖేష్‌ సింగ్‌ ఇంట్లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఎక్సైజ్‌ పోలీసులు దాడులు చేసి 2.27 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అమ్మకాలు సాగిస్తున్న సతీష్‌ దినేష్‌ సింగ్‌, అరుణ్‌ బాయిలను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి గంజాయి తోపాటు సెల్‌ ఫోన్‌, యాక్టివా వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఇంటి యజమాని ముఖేష్‌ సింగ్‌పై కూడ కేసు నమోదు చేశారు. బాలానగర్‌ ఎక్సైజ్‌ పోలీసుల పరిధిలోని డెనియల్‌ నగర్‌లో నకిరేకల్‌కు చెందిన రజనీకాంత్‌ వద్ద 1.05 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ వినాయకనగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణం పట్ల జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ వార్డు కమిటీ సభ్యుడు ఆడాల అశోక్‌ కుమార్‌ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినాయకనగర్‌లో ఓ వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా, పొరుగిళ్లకు ప్రమాదం జరిగేలా ఇష్టానుసారంగా పిల్లర్‌ గోతులు తవ్వి నిర్మాణ పనులు చేపడుతున్నారని అన్నారు. ఈ విషయంలో ఇప్పటికే పలుమార్లు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయికి నివాళి

చార్మినార్‌: సిటీ కాలేజీలో మంగళవారం ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కాలేజీ ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రొఫెసర్‌ ఏలూరి యాదయ్య మాట్లాడుతూ ఒక చంకలో శిశువును, మరో చేతిలో ఖడ్గాన్ని ధరించి దేశం కోసం పోరాడిన ఝాన్సీ లక్ష్మీబాయి గొప్ప స్వాతంత్ర్య సమరయోధురాలని కొనియాడారు. కార్యక్రమంలో ఏవో మాధవి, ప్రొఫెసర్‌ శంకర్‌, రామ్‌కుమార్‌లతోపాటు కాలేజీ అధ్యక్షుడు జితేందర్‌ తదితరులు పాల్గొన్నారు.